క్లుప్తంగా

పద్ధతి మార్చుకోకుంటే చర్యలు



ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: మండల ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యపు ధోరణి మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ రాణెమ్మ హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం ఆమె తన ఛాంబర్‌లో ఉపాధిహామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధిహామీ సిబ్బందిపై గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని మండిపడ్డారు. అధికారులు సైతం విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లు విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు కాంట్రాక్టర్లు, పెద్దల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని ఎంపీడీఓ తెలియజేస్తూ పద్ధతి మార్చుకోవాలని సూచించారు. సమీక్షలో జీఈ రంగస్వామి, టీఏలు, ఎఫ్ఏలు, సీఓలు ఉన్నారు.

ఉల్లి పంటను కాపాడుకోవాలి



దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పైరును ఉద్యానవన జిల్లా, కోడుమూరు అధికారులు రామాంజనేయులు, మధుమోహన్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. సోమవారం మండలంలోని ముడుమాల, పల్‌దొడ్డి, కొండాపురం గ్రామాల్లో పర్యటించి ఉల్లి పంట నష్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పొలాల్లో కోతలను, తడిసిన ఉల్లి దిగుబడులను పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం వారు ఉల్లి పంటను వర్షాల నుంచి కాపాడుకునే చర్యలను రైతులకు వివరించారు. ఉల్లి పంటలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు ఉద్యానవన శాఖ ద్వారా కొత్తగా సాగు చేస్తున్న పండ్ల, పూల తోటలను, పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యవసాయ సహాయకులు ప్రవీన్, అఫ్రిన్, హనీఫ్, విజయలక్ష్మి, రైతులు ఉన్నారు.


సంకల్ప శక్తితోనే విజయం సాధ్యం



మాట్లాడుతున్న చైర్మన్ శాంతిరాముడు

పాణ్యం: సంకల్ప శక్తితోనే పురోగతి సాధ్యమవుతుందని ఆర్‌జీఎం విద్యాసంస్థల చైర్మన్ శాంతిరాముడు అన్నారు. సోమవారం ఆర్‌జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలల ఒరియంటేషన్‌డే కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు సామాజిక స్పృహతో పాటు సాంకేతిక నైపుణ్యం, మానవ విలువల మధ్య సమతుల్యతను సాధించే దిశగా విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి బ్రాంచ్‌లో అకడమిక్ టాపర్లకు పూర్తి రీయింబర్స్‌మెంట్‌తో పాటు నగదు, బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు సుబ్రమణ్యం, జయచంద్రప్రసాద్, డైరెక్టర్ ఆశోక్‌కుమార్, రామిరెడ్డి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పెసరవాయిలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో సోమవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై రక్త పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. వ్యాధి సోకిన వారు మందులు వాడుతూ, వైద్యుల సలహాలు పాటిస్తే ఎలాంటి ఆరోగ్య పరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చన్నారు. సూపర్‌వైజర్ మీరం రెడ్డి, సీహెచ్ఓ అలీబాషా, వెంకట సుబయ్య, ఏఎన్ఎం నిర్మల కుమారి పాల్గొన్నారు.

నష్టాల బాటలో కూరగాయల రైతులు

- ప్రతికూల వాతావరణ ప్రభావంతో తగ్గిన దిగుబడులు
- గిట్టుబాటు కావడం లేదని రైతుల ఆందోళన
- కాయలను పట్టిపీడిస్తున్న చీడపీడల ఉధృతి
- గణనీయంగా తగ్గిన కూరగాయల సాగు



కొమరోలులో సాగు చేసిన వంకాయ తోట

ఓర్వకల్లు: అధిక వర్షాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగడంతో కూరగాయ రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో కురిసిన అరకొర వర్షాలకు సాగు చేసిన కూరగాయలకు పిందె, కాయదశలో వర్షాలు అధికంగా కురువడంతో తెగుళ్ల బారిన పడ్డాయి. ఓర్వకల్లు మండలంలోని కొమరోలు, సోమయాజులపల్లె, చెన్నాశెట్టిపల్లె, ఉయ్యాలవాడ, నన్నూరు గ్రామాల్లో వ్యవసాయ బోరుబావుల కింద అధిక శాతం కూరగాయ పంటలపై ఆధారపడి జీవిస్తారు. ఇందులో ప్రధానంగా వంకాయ, టమాట, మిరప, తీగజాతి పంటలైన చిక్కుడు, బీర, సొర, కాకరకాయ తదితర కూరగాయలను సాగు చేస్తారు.

తగ్గిన సాగు

ఈ ఏడాది ఖరీఫ్ జులై మాసంలో నెలకొన్న వార్షభావ పరిస్థితుల దృష్ట్యా కూరగాయలను సాగు చేసుకునే రైతులు ప్రత్యామ్నాయంగా ఇతర వ్యవసాయ పంటల వైపునకు దృష్టి మళ్లించారు. దీంతో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోయింది. సాధారణంగా మండలంలో ఏటా వర్షాధారం కింద సుమారు 2500 హెక్టార్ల(6,250 ఎకరాలు)లో పండ్ల తోటలు, తీగజాతి కూరగాయలు, ఉల్లి, టామాట, వంకాయ, మిరప, తదితర పంటలను సాగు చేసేవారు. అయితే జులై మాసంలో అల్ప వర్షాల కారణంగా కేవలం 1200 హెక్టార్లకే పరమితమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన కనీసం 50 శాతం కూరగాయలు, పండ్లతోటలు సాగవ్వలేదని తెలుస్తుంది. సెప్టెంబర్ మొదటి వారం వరకు గడువు ఉండడంతో ఈలోగా సాగు విస్తీర్ణం 10 శాతం పెరిగే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు వర్షాధారం కింద సుమారు 350 ఎకరాల్లో ఉల్లి, 100 ఎకరాల్లో మిరప సాగైనట్లు తెలుస్తుంది.

అధిక వర్షాలకు దెబ్బతిన్న కూరగాయలు

టమాట, వంకాయ, చిక్కుడు, మిరప, బెండ వంటి కూరగాయ పంటలకు అధిక వర్షపాతం వల్ల చీడ పీడల ఉధృతి పెరగడంతో, వేర్లు కుళ్లి మొక్కలు ఎండిపోయే అవకాశం ఉంటుంది. అంతేగాక, భూమిలోని పోషకాలు మొక్కలకు అందకుండా పోతాయి. ఒక్కోసారి విత్తనాలు మొలకెత్తకుండా పోయే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగడం వల్ల మొక్కలకు పండు తెగులు, ఆకుమచ్చ తెగులు, (అగ్గి తెగులు), బింగి తెగులు, వేరుకుళ్ల తెగుళ్లు, బూడిద తెగులు వంటి తెగుళ్ల ఉధృతి పెరుగుతుంది. ఈ తెగుళ్లతో పిందెలు, కాయలు రాలిపోవడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు

వర్షాలు తెరపు ఇచ్చిన తర్వాత వెంటనే 19:19:19/13:0:45/యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలి. నేల కొంచెం ఆరిన తర్వాత రసాయనిక ఎరువులను నేలలో వేసుకోవాలి. వర్షాలు తగ్గిన వెంటనే అంతర సేద్యం చేసి, కలుపు మొక్కలను తొలగించడమేగాక, నేల త్వరగా ఆరేలా చూసుకోవాలి. వంకాయలో అక్షింతల పురుగు, చిత్త పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2 లీటర్ల నీటిలో/థయోడికార్బ్ 1 గ్రాము నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి/2 గ్రాముల మంకోజెబ్‌ను లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పోయడం వల్ల పురుగుల ఉధృతిని నివారించుకోవచ్చు. బాక్టీరియా మచ్చ తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్/2 గ్రాముల ప్లాంటామైసిన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని హార్టి కల్చర్ అధికారులు పేర్కొంటున్నారు.

తెగుళ్ల దెబ్బ

అధిక వర్షాల ప్రభావంతో వివిధ కూరగాయ పంటలైన టమాట, వంకాయ, మిరప వంటి కూరగాయలపై తెగుళ్ల ఉధృతి పెరుగుతోంది. తద్వారా టమాటలో మొక్క ఎదుగుదల తగ్గటం, పూత రాలడం, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు రావడం జరుగుతుంది. అదే వంకాయలో అయితే ఆకులు పసుపుబారడం, పూత రాలటం, అక్షింతల పురుగు, బాక్టీరియా మచ్చ తెగులు సోకుతుంది. మిరపలో నారు కుళ్లు తెగులు, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు, కొయనోఫార తెగుళ్లు ఆశించడంతో పంట దిగుబడి తగ్గిపోతుంది.

మందులు కొట్టినా తగ్గడం లేదు



నాకున్న 2 ఎకరాల భూమిలో ఎకరా టమాట, ఎకరా వంకాయ సాగు చేశాను. నారు నాటిన సమయంలో వర్షాలు తక్కువగా ఉండడంతో మొక్కలు బాగా పెరిగాయి. అయితే పూత, పిందె దశలో అధిక వర్షాలు కురిసి పూత, పిందె రాలిపోయాయి. వంకాయలో బంగి తెగులు సోకి కాయలు రాలిపోవడం, ఆకులు ముడతలు పడడం జరుగుతుంది. ఇప్పటికే మందుల కోసం రూ.50 వేలు ఖర్చు పెట్టాను. అయినా ఎన్ని మందులు కొట్టినా నివారణ కావడంలేదు. ఇలాగైతే పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి.

– అశ్వర్థనారాయణ, కూరగాయల రైతు, కొమరోలు

వంకాయ పూర్తిగా దెబ్బతింది



ఈ ఏడాది ఎకరా రూ.20 వేల చొప్పున 5 ఎకరాల మాన్యం భూమిని కౌలుకు తీసుకుని వంకాయ పంటను సాగుచేశాను. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించక కోత దశకు వచ్చేసరికి అధిక వర్షాల కారణంగా తెగుళ్లు సోకడంతో కాయలు రాలిపోతున్నాయి. పెట్టుబడి ఖర్చులు, రసాయన ఎరువులు, కూలీలకు, క్రిమిసంహారక మందులకు ఇప్పటికే దాదాపు రూ.5 లక్షలు ఖర్చు పెట్టాను. అయినా నామమాత్రపు దిగుబడులు రావడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధరల్లేక కనీసం పెట్టిన ఖర్చులు కూడా వస్తాయనే నమ్మకం లేదు.

– పుల్లయ్య, వంకాయ రైతు, కొమరోలు

ఈ ఏడాది పంట విస్తీర్ణం తగ్గింది



ఈ ఏడాది జులై మాసంలో సరైన వర్షాలు కురవకపోవడంతో కూరగాయల సాగు విస్తీర్ణం సగానికి పడిపోయింది. అరకొర వర్షాలకు సాగు చేసిన పంటలు అధిక వర్షాభావ పరిస్థితుల కారణంగా మొక్కలకు తెగుళ్లు సోకడంతో పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టాలకు గురవుతున్నారు. తెగుళ్ల నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల కొంత మేరకు నష్టాన్ని అధిగమించవచ్చు.సెప్టెంబర్ నెల మొదటి వారం వరకు కూరగాయల నార నాటుకునేందుకు అవకాశం వుంది. ఈ లోగా పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– అనూష, హార్టికల్చర్ అధికారిణి

సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు(రూరల్): గ్రామాల్లో సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టర్ కార్యాలయం దిగ్బంధిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘువేంద్ర, అబ్దుల్లా స్పష్టం చేశారు. కర్నూలు ఎంపీడీఓ కార్యలయం ముందు సోమవారం డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రాఘవేంద్ర, అబ్దుల్లా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గత 8 నెలల నుంచి కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ నిర్మించాలని పలు కాలనీ వాసులను కలుపుకుని ఆందోళనలు చేపడుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం కూటమి ప్రభుత్వం అసమర్థ పాలనకు నిదర్శనం అని విమర్శించారు.

ఆస్పత్రిని సందర్శించిన న్యాయమూర్తి



మానసిక దివ్యాంగులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కోడుమూరు రూరల్: గూడూరు మండలం పెంచికలపాడులోని విశ్వభారతి హాస్పిటల్‌ను సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి సందర్శించారు. ఆసుపత్రిలోని మానసిక దివ్యాంగుల విభాగాన్ని తనిఖీ చేసి మానసిక దివ్యాంగులతో మాట్లాడి న్యాయపరమైన హక్కుల గురించి వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మానసిక దివ్యాంగులకు న్యాయ సహాయం కోసం లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ మనోన్యాయ్ సభ్యుల సంబంధిత ఫోన్ నంబర్ల బోర్డును ఆవిష్కరించారు. మానసిక దివ్యాంగులకెవరికైనా న్యాయ సహాయం కావాలంటే బోర్డు నందు గల ఫోన్ నంబర్లకు ఫోన్ చేస్తే వారికి కావాల్సిన న్యాయ సహాయం అందిస్తామని సూచించారు. హాస్పిటల్ డాక్టర్ మహేంద్రకుమార్, సైక్రియాటిస్ట్ శివశంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ పట్టని అధికారులు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



రైతు నుంచి అర్జీ తీసుకుంటున్న డీటీ పురుషోత్తం

కోడుమూరు రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం పట్ల మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రతి సోమవారం కోడుమూరులోని తహసీల్దా ర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఇద్దరు ముగ్గురు అధికారు లు తప్ప మిగిలిన అధికారులెవ్వరూ హాజరు కావడం లేదు. ఒక వేళ వచ్చినా చుట్టపు చూపుగా అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. దీంతో వివిధ సమస్యలపై అర్జీలిచ్చేందుకు వచ్చే ప్రజలు తమ సమస్యలను ఎవ్వరికి విన్నవించుకోవాలో తెలియక వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కేవ లం తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాముడు మా త్రమే హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు మూడు అర్జీలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్)కు మండల రైతుల నుంచి మూడు అర్జీలు వచ్చాయి. ఆయా శాఖలకు చెందిన మండల అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి డీటీ పీజీఆర్ఎస్‌ను నిర్వహించగా, ముడుమాల, బురాన్‌దొడ్డి, సంగాల గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని డీటీ రైతులతో అన్నారు. తహసీల్దార్ కార్యాలయ పీజీఆర్ఎస్‌లో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఆర్ఐ తరున్, వీఆర్వోలు ఉన్నారు. అదేవిధంగా మండల అధికారులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ సైతం పీజీఆర్ఎస్‌ను నిర్వహించగా, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, ఎంఈఓ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనా తదితరులు హాజరయ్యారు.

భూ సమస్యలపై అర్జీలు



తహసీల్దారు రమేష్‌బాబుకు అర్జీ ఇస్తున్న రైతులు

కర్నూలు(రూరల్): భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కర్నూలు రూరల్ తహసీల్దారు టీ.వీ.రమేషబాబుకు అర్జీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉల్చాల, జి.సింగవరం, ఆర్.కొంతలపాడు, దిన్నెదేవరపాడు, నందనపల్లె, పూడూరు, సుంకేసుల తదితర గ్రామాలకు చెందిన రైతులు భూముల సర్వే, మ్యుటేషన్, పాస్ పుస్తకాలు, తదితర వాటిపై అర్జీలు అందజేసినట్లు చెప్పారు. అర్జీలను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని తహసీల్దారు వీఆర్వోలకు సూచించారు.

కంది పంట తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వ్య.కా.స నాయకులు

ఓర్వకల్లు: దశాబ్దాల నుంచి దళితులు సాగు చేసుకుంటున్న భూముల్లో కంది పంటను దౌర్జన్యంగా నాశనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతుల తరుపున వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నన్నూరు దళిత రైతులు, రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్‌తో కలిసి నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నన్నూరు గ్రామానికి చెందిన సర్వేనంబర్ 1292లో సుమారు 70 ఏళ్లుగా దళితులు భూములను సాగుచేసుకొని జీవనం పొందుతున్న భూములకు 2008లో ప్రభుత్వం వారిని పేదలుగా గుర్తించి, పట్టాపాసు పుస్తకాలను మంజూరు చేసిందని తెలిపారు. అలాంటి భూముల్లో వేసిన కంది పంటను రెండు సార్లు ట్రాక్టర్లు, జేసీబీలతో నాశనం చేయడం దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు భూములను అగటు లక్ష్మిదేవి, అగటు శంకరమ్మ, బొల్లవరం బాలమ్మకు వారి పెద్దల నుంచి వచ్చిన భూములను ఎన్నో వ్యయప్రయాసాలుపడి, ముళ్ల పొదలను తొలగించి చదును చేసుకొని, సాగులోకి తెచ్చుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి భూములను ఇష్టరాజ్యంగా బయటి వ్యక్తులను తోలుకొని వచ్చి రైతులను భయభ్రాంతులకు గురిచేసి పంటలను నాశనం చేయడం ఎంత వరకు న్యాయమని విమర్శించారు. ఇప్పటికే పది రోజులు పూర్తయినా పోలీసు అధికారులుగానీ, రెవెన్యూ అధికారులుగానీ స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. శివకుమార్, రామచంద్రుడు, వంశీ, గిరిబాబు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరకు అమ్మితే చర్యలు



గడివేములలోని ఓ దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

గడివేముల: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటరమణ, ఏఓ పవన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న యూరియా బస్తాల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు వ్యాపారులు యూరియాను నిల్వ ఉంచి, అధిక ధరలకు అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా వ్యాపారులు యూరియాను దాచిపెట్టి, కృత్రిమ కొరత సృష్టించి రైతులకు అధిక ధరలకు అమ్మితే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని తెలిపారు. రైతులు మోతాదుకు మించి యూరియాను వాడరాదని సూచించారు. పంటలకు మోతాదుకు మించి యూరియా వాడడం వల్ల దుష్ప్రభావాలు ఉంటాయన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు ఇవ్వాలన్నారు.

నింగిలో సువర్ణ కాంతులు



ఎర్రములు కొండల్లో పచ్చటి చెట్లు.. పక్షుల కిలకిలరావాలు కనువిందు చేస్తుంటాయి. వీటికి తోడు సూర్యాస్తమయ వేళలో బంగారు వర్ణంలో భానుడు తోడైన వేళ అందాలు మహానందంగా అగుపించాయి. పచ్చటి చెట్లు తోరణాలుగా, అస్తమించే భానుడి వెలుగుల మధ్య మరింత అందం ఆవిష్కృతమైన ఈ దృశ్యాలు సోమవారం సాయంత్రం కనిపించగా సాక్షి కెమెరాలో బంధించింది.

– గడివేముల

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎరువుల దుకాణాల్లో డీఏఓ వరలక్ష్మి ఆకస్మిక తనిఖీలు
- కోడుమూరులో 30.5 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ వరలక్ష్మి



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే దుకాణదారుల లైసెన్సు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కోడుమూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో డీఏఓ వరలక్ష్మి, మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్, గూడూరు ఏఓ దస్తగిరిరెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఏఓ ఆయా దుకాణాల్లో ఎరువుల స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు, గోదాముల్లో నిల్వ ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఉరుకుంద రైతు డిపో నందు ఈ-పాస్ మిషన్ బ్యాలెన్స్‌కు, ఫిజికల్ బ్యాలెన్స్‌కు తేడా ఉండడంతో 27 మెట్రిక్ టన్నుల యూరియా, 3.5 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు రైతులు అడిగిన ఎరువులు, మందులను మాత్రమే ఇవ్వాలని ఆదేశించారు. ఎవరైనా దుకాణదారులు ఎరువుల స్టాక్‌ను ఉంచుకుని రైతులకు లేదని చెబితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూడూరులో..

అనంతరం జేడీఏ వరలక్ష్మి గూడూరు పట్టణంలోని సత్యనారాయణ ట్రేడింగ్, మన గ్రోమోర్ సెంటర్లలో ఏఓ దస్తగిరిరెడ్డితో కలిసి తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు ఎరువులను అమ్మరాదని, ఒక ఎరువు బస్తాకు మరోకు బస్తాకు లింకు పెట్టకుండా రైతులు అడిగిన ఎరువులను మాత్రమే విక్రయించాలని జేడీఏ ఆదేశాలు జారీ చేశారు.

యూరియాను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

కల్లూరు: యూరియాను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఆంజనేయులు హెచ్చరించారు. సోమవారం ఉలిందకొండ గ్రామంలో మండల స్థాయి టీం ఆధ్వర్యంలో యూరియా, ఎరువులను తనిఖీ చేశారు మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి రమేష్ ట్రేడర్స్, శ్రీ జయకృష్ణ ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్, రైతు సేవా కేంద్రాల్లోని యూరియాను నిల్వలను పరిశీలించారు. ఆయా షాపుల్లో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఉలిందకొండ రైతు సేవా కేంద్రం-1లో 13.5 టన్నులు, రైతు సేవా కేంద్రం -2లో 12.6 టన్నులు యూరియా నిల్వలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారి వెంట ఏఎస్ఐ విజయ్ రాజు, వీఆర్వో శ్రీనివాసులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

పాణ్యం: రైతులు అవసరమైన మేరకే యురియా తీసుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పాణ్యంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ, రెవెన్యూ, పోలీసుశాఖ సంయుక్తంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎరువుల దుకాణ యజమానులు ఒకే రైతుకు పదుల సంఖ్యలో యూరయా బస్తాలు విక్రయించరాదని తెలిపారు. అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం యురియా విక్రయాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఎక్కడైనా అనధికారికంగా యురియా నిల్వలు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఎస్ఐ నరసింహులు, ఆర్ఐ రామ్, వీఆర్ఓ శంకర్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాలక్రిష్ణ

పాణ్యం: నేత్రదానం చేయడం వల్ల ఇతరులకు వెలుగును ఇచ్చిన వారవుతారని పాణ్యం సీహెచ్‌సీ డాక్టర్ వేణుగోపాలక్రిష్ణ, మద్దూర్ పీహెచ్‌సీ డాక్టర్ అభిషేక్ అన్నారు. సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే నెల 8వ తేదీ వరకు పక్షోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని పేర్కొన్నారు. అలాగే నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరికి చూపు ఇచ్చిన వారవుతారన్నారు. నేత్రదానంపై ఎలాంటి అపోహాలు పెట్టుకోరాదన్నారు. అనంతరం రెండు ఆస్పత్రుల వద్ద ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అప్తాల్మిక్ అధికారులు హనీఫ్, వర్షిని, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.